
## కథ

''సర్, మీతో అర్జెంట్‌గా మాట్లాడాలి ఎప్పుడు రమ్మంటారు?''
అని టెలిఫోన్‌లో ఎవరో అడిగారు.
ఆ గొంతు గుర్తుకు రాలేదు శంకరానికి, ''క్షమించండి,
ఎవరు మాట్లాడుతున్నది?'' ' అన్నాడు.
''నేనండి. మీ టైలర్ జయరావును'' అని సమాధానం వచ్చింది.
''ఈ సాయంత్రం అయిదు గంటలకు వస్తే బాగుంటుంది''
అని జవాబు చెప్పాడు. సరిగ్గా గడియారం అయిదు కొట్టేటప్పటికి
ప్రత్యక్షం అయ్యాడు జయరావు, ''నమస్కారమండీ'' అంటూ.
''ఏమిటి సంగతి !?''
''పెద్దవిషయం ఏమీ కాదండీ. మీకు శ్రమ యిస్తున్నాను''
''చెప్పు-''

# ఉపక్షేపం

శ్రీవిరించి



గొంతు యింకాస్త సరళం చేసుకుంటూ జయరావు, ''నేను నవల రాసేనండీ. చిన్నదే. నూట యిరవయి పేజీల కంటే ఎక్కువ కాదు అచ్చులో. కాని- చదివిం తర్వాత, నాకే తృప్తిగా అనిపించలేదు. మీరు కాస్త దాన్ని చదివి, సవరణలు చెప్పాలి. మీ మీద నమ్మకంతో తీసుకు వచ్చాను'' అంటూ చేతి సంచిలోంచి ఓ కాగితాల బొత్తి బయటపెట్టాడు.

శంకరానికి ఆశ్చర్యం అనిపించింది. జయరావు నవల వ్రాయడం ఏమిటి? హాయిగా బట్టలు కుట్టేపని చేసుకుంటూ కూర్చోక ! అంతేకాదు, మీరు వ్రాసింది వారికి ఎంతో ప్రీతిపాత్రంగా వుండే రోజుల్లో తన రచన తనకు అసంతృప్తిగా వుంది అని నిర్మొహమాటంగా చెప్పడం- మరింత విడ్డూరం !

అతని నిజాయితీకి కాస్త నివ్వెరపోయిన మాట నిజమే. ఏమైనా చొక్కాలు, పాంట్లు రిపేర్ చేయించు కోవలసి వస్తే జయరావు దగ్గరకు తీసుకువెళ్లటానికి ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తాడు శంకరం. కొత్త బట్టలు కుట్టటంలో ఎప్పుడూ బిజీగావుండే శంకరం రిపేర్ పని చేయమంటే ముఖం చిరాగ్గా పెడతాడు. అతని పనితనంలో విశ్వాసంవల్ల యెంత ఆలస్యం అయినా ఓపిగ్గా ఆగుతాడు శంకరం. జయరావుకు పనిలో నైపుణ్యం వున్నమాట నిజయే అయినా అతనికి టైం సెన్స్ అనేది బొత్తిగా లేదని కూడా తెలుసు. ఎప్పుడూ బట్టలు ఇస్తానన్న టైముకు యిచ్చి పుణ్యం కట్టుకోలేదు. రెండు వాయిదాలన్నా వేయ కుండా పని పూర్తిచేయడం జయరావుకు సుతరామూ వీలుకాదు. అలాంటి మనిషి యిప్పుడు నవల రాయడమే కాకుండా, దాని రిపేర్ వర్క్ తనకు యివ్వచూపుతున్నాడు.

''అలాగే చూసి పెడతాను'' అంటూ కాగితాలు అందుకున్నాడు. జయరావు ముఖం ఆనందంగా వెలిగిపోయింది. ''మళ్లీ ఎప్పుడు రమ్మంటారు నన్ను'' అన్నాడు నిదానంగా.

''ఓ వారం రోజులు టైం యివ్వు''

''అయితే పై బుధవారం యిదే టైంకు వస్తానండీ- మీ మేలు ఎన్నటికీ మరిచిపోను'' అని నమస్కారం చేసి వెళ్లిపోయాడు.

అన్నట్లుగానే బుధవారం మళ్లీ ప్రత్యక్షం అయ్యాడు.

అతనికి 'టైం సెన్స్'లో ట్రెయినింగ్ యిస్తున్నందుకు సంతోషించాడు శంకరం. ''అంతా చదివాను. నీవన్నట్లు నాకూ అసంతృప్తిగానే వుంది'' అంటూ ప్రారంభం చేశాడు.

'ఏం చేయాలంటారు?'' వినయంగా అడిగాడు జయరావు.

''చాల చిక్కుగా వుంది''

''ఈ చిక్కుముడులు మీరే విడదీసే ఉపాయం చెప్పాలి''

''ఆరు పాత్రలున్నాయి గదా ! వాటిలో రెండింటిని పూర్తిగా రిపేర్ చేయాలి. అనేక చోట్ల ఆ మాటలు తీసేసి కొత్త పదాలు చేర్చాలి. నీ దగ్గర నిఘంటువు వుందా?''

''నిఘంటువు అంటే ఏమిటో నాకు తెలీదు సర్'' అన్నాడు జయరావు చాలా తప్పుచేస్తు న్నానన్న భావం ముఖంలో స్పష్టంగా చూపిస్తూ.

''నేనూ అదే అనుకున్నాను. సంఘటన లన్నీ మళ్లీ విడదీసి, తిన్నగా ఎసెంబుల్ చేయాల్సి వుంటుంది?''

''మీరే నాకు సహాయం చేయాలి. మీ కష్టం వుంచుకోను.?''

''అదే కాస్త బరువయిన పని. నేనిప్పుడు క్షణం తీరుబడి లేకుండా వున్నాను. అదీగాక నేను చాల ఖర్చుతో కూడుకున్న మనిషిని''

జయరావు అందరు టైలర్ల కంటే యాభై రూపాయలు ఎక్కువే చార్జ్ చేస్తాడు. అతని పని నైపుణ్యం కోసం ఆ మాత్రం భరించడం శంకరానికి ఎప్పుడూ అలవాటే !

శంకరం ధైర్యం చేసి ఓ అంకె చెప్పాడు.

''చాలా ఎక్కువ సర్. నేను భరించలేను'' అన్నాడు వెంటనే జయరావు. మనస్సు పెట్టే బాధలు పడలేక నేను యీ పనికి



పూనుకున్నాను. ఇందువల్ల నా టైలరింగ్ కూడా దెబ్బతిన్నది. మీరే యేదో పెద్దమనసు చేసి నన్ను ఈ ఆపద నుంచి బయట పడేయాలి. మీ మీద నమ్మకంతోనే నేనీ సాహసానికి పూనుకున్నాను. మరోమాట చెప్పండి?''

''డబ్బు మాట అట్లా వుంచు. నాకు క్షణం తీరిక లేకుండా వుందని ముందే చెప్పాను గదూ ! సూచనలు యిస్తాను. నీవే ఈ పని చేసుకోరాదూ?''

''బాబ్బాబు ! మీకు పుణ్యం వుంటుంది. నా బిడ్డను నేను నరుక్కోలేను. మీరే అవసరమైన సర్జరీ అంతా చేయాలి'' అన్నాడు ప్రాధేయ పడుతూ

''కొన్నిగంటలపని. ఏకబిగిని చేయటానికి వీలులేదు. కనీసం రెండు నెలలయినా పడుతుంది. నవలంతా తిరిగి రాయాలి. కాగితాలు, కంప్యూటర్ ఖర్చులు, నిఘంటువు ఉపయోగం... యివన్నీ చాలా అవుతాయి. పోనీ, యింకెవరినన్నా సజెస్ట్ చేస్తాను, వాళ్ల సహకారం తీసుకోరాదూ?''

''ఆ మాట మాత్రం అనకండి. ఎవరినీ నేను ఎరగను. పైగా మీరంటే నాకు గౌరవం, నమ్మకం. ఈ పని మీరే చేసిపెట్టాలి?'' అని 'మహావిశ్వాసం' కనపరిచాడు.

శంకరానికి ఆనందంతో మనస్సు ఉబ్బితబ్బిబ్బయింది. అయినా యిది 'టైం'తో కూడుకున్న పని. పొగడ్తలకు పొంగిపోయి, మొయ్యలేని భారం మీద వేసుకుంటే తరువాత తను చిక్కుల్లో పడిపోతాడు.

''నువ్వు యింతగా చెబుతున్నావు గనుక- నేనే చేస్తాన్లే-'' అంటూ ఆగిపోయాడు శంకరం. ''మరింకేమీ చెప్పకండి. ఐదువేలు- ఎడ్వాన్స్‌గా యీ కాస్తమొత్తం వుంచండి. నవల కొత్తరూపంలో తీసుకు వెళ్లేటప్పుడు మీరు అడిగినంతా ముట్టచెబుతాను. నన్ను నమ్మండి. ఈ కష్టాలలోంచి నన్ను మీరే బయటపడెయ్యాలి'' అని జయరావు ఓ బరువైన కవరు అందించాడు.

''నన్ను మరీ యిరకాటంలో పెడుతున్నావు జయరావ్ !'' అంటూనే అందుకున్నాడు శంకరం.

''మళ్లీ ఎప్పుడు దర్శనం చేసుకోమంటారు!''

''రెండు నెలల తరువాత''

జయరావు ''అలాగే...అలాగే'' అంటూ ప్రస్తుతానికి సెలవు తీసుకువెళ్లాడు.

* * *

శంకరం పని యిప్పుడు యిరకాటంలో పడిపోయింది, యదార్థంగానే.

నవలను మళ్లీ చదవాల్సి వచ్చింది. ఎన్నో లోపాలు. కలుపుమొక్కలు లాంటిపాత్రలు తీసివేయాలి. కథానాయకుడు బలహీనంగా వున్నాడు. అతనికి పుష్టి యివ్వడం ఎంతో శ్రమ పడితే కాని కుదరదు. ఇదంతా తనవల్ల అవుతుందనే నమ్మకం కూడా సడలిపోతోంది. సంఘటనలు, సన్నివేశాలు తిప్పిరాయాలి. జాతీయాలు వాడాడు జయరావు. వీటికి సందర్భ శుద్ధి చేకూర్చడం ఒకరకంగా పూర్తి అయ్యే పని కాదు. కాని, అడ్వాన్స్ తీసుకున్నాడు గనుక యీ పని నుంచి బయటపడటానికి లేదు.

రెండు నెలలు యిట్టే గడిచి పోతున్నాయి.

శంకరం మాత్రం పని పూర్తి చేయలేక పోయాడు.

వాయిదా అడగడం తేలికే. జయరావు కాదనలేడు. అసలు యీ పని తనవల్ల అవుతుందా అవదా అనేది కూడా అనుమానంగానే తయారయింది. ఆలోచించిన కొద్దీ ఎన్నెన్నో అవాంతరాలు, అభ్యంతరాలు ముందుకు వచ్చి నిలుస్తున్నాయి.

అతను యిట్లా అనేక సందేహాలలో కొట్టుమిట్టాడుతూ వుండగా ఆకస్మాత్తుగా ఒక అమ్మాయి యెదురుగా వచ్చి నిలుచుంది. ఆమె ముఖం పేలవంగా వుంది. అయినా కళ్లల్లో కోపం కొట్టవచ్చినట్లుగా కనిపిస్తోంది. ''ఎవరమ్మా నువ్వు?'' అని అడగడం తప్పయింకేం చేయలేకపోయాడు.

''నేను జయరావు కూతురును, నేనూ మిమ్మల్ని యింతకు పూర్వం ఎరుగను. రెండు మూడు నెలలుగా మీ బల్ల మీద తారట్లాడుతున్నాను. నాకు తెలిసి నేనేం అపకారం చేయలేదు. నన్నెందుకు మీరు పీకనులిమేసి చంపిపారేయాలని అనుకుంటున్నారో నాకేం కారణం కనబడడం లేదు'' అంది ఆ అమ్మాయి.

నవలలో ఒక పాత్రను తీసివేయాలనుకోవడం అతనికి చప్పున గుర్తువచ్చింది. హంతకుడుగా తనకు ముద్రవేసి ముద్దాయిని చేసి నిలబెడుతోంది-యిప్పుడు. ఆ అమ్మాయికి సమాధానం యేంచెప్పాలో తోచలేదు అతనికి. ఈమె వల్లనే చిక్కులు యేర్పడడం మటుకు స్పష్టం. చిక్కులు తొలగిపోవాలంటే ఆ పాత్రను పూర్తిగా 'ఎలిమినేట్' చేయడం తప్ప మరో ఉపాయం లేదు.

''నన్నేం చేయమంటావు?'' అన్నాడు దీనంగా శంకరం.

అతనికో చిన్న కథ గుర్తుకు వచ్చింది. అందులో భగవంతుడి అస్థిత్వాన్ని గురించి అనేక ప్రశ్నలు వస్తూంటాయి. ఉన్నాడని ఒకడు, లేడని మరొకడు తీవ్రంగా వాదించుకుంటూ వుంటారు. చివరకు ఉన్నాడనుకున్నవాడు, లేడన్నవాడిని చంపిపారేసి యీ సంఘర్షణ నుంచి అలవోకగా బయట పడిపోదామని నిర్ణయం చేసుకుంటాడు. ఇంతలో భగవంతుడే అతనికి ఎదురుగా వచ్చి ''నేను లేనన్నవాడిని, యిన్ని సంవత్సరాలుగా నేనే చంపివేయడం లేదు. నీవెందుకు యీ పాపాన్ని మూటగట్టుకోవాలని చూస్తావు? వాడి మానాన వాడిని అలాగే వుండనివ్వు. కాసేపు అతన్ని భరించడం కూడా నీకు చేతకాదా? ఆ మాత్రం తాలిమి లేకపోతే యీ ప్రపంచంలో ఎలా నిలదొక్కుకుంటావు?''- అని దబాయిస్తాడు. ఒక పక్క చీమలు, దోమలు మనిషికి ఎంతో యిబ్బంది కలిగిస్తున్నాయి. అయినా యీ విశాలమయిన సృష్టిలో వాటికీ యేదో పాత్ర వుంది. నీకు అసౌకర్యం అని వాటిని చంపి వేస్తే- కథ యెట్లా ముందుకు నడుస్తుంది?

జీవితాన్ని ఉన్నది ఉన్నట్లుగా కాకుండా నీకు అనుకూలంగా తీర్చిదిద్దుకోవడం ప్రయత్నించడం అవసరమా? దిద్దుబాటు చేసుకోకపోతే, యిక ముందుకు సాగడం కూడా అసాధ్యం అయిపోతుందేమో గదా? యిదే మనిషి అనాది నుంచీ ఎదుర్కొంటున్న ప్రశ్న. ఈ ప్రశ్నకు ఎవరికి తోచిన బలాన్ని ఉపాయాన్ని ప్రయోగించి ప్రపంచం అంతటినీ అల్లకల్లోలంలో ముంచివేస్తున్నారు.



# హాస్పిటల్లో ఎలిజబెత్ టేలర్

అందం, అభినయాల అద్వితీయమైన మిశ్రమంగా హిందీ సినిమా రంగంలో మధుబాల, తెలుగు సినిమా రంగంలో సావిత్రి ఎంత పేరుపొందారో అలనాటి హాలీవుడ్ నటీమణి ఎలిజబెత్ టేలర్ కూడా అంతే ప్రసిద్ధి చెందింది. అంతేకాదు, ఇప్పటివరకూ అత్యధికంగా ఎనిమిది పెళ్లిళ్లు చేసుకున్న నటిగా కూడా ఆమెకు పేరుంది. అయితే 76 సంత్సరాల టేలర్ ప్రస్తుతం అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఇప్పటికే ఆమెకు ఒకసారి బ్రెయిన్ ట్యూమర్ ఆపరేషన్ జరిగింది. ఈ మధ్య కాలంలో వృద్ధులు అధికంగా ఎదుర్కొంటున్న అల్జీమర్స్ వ్యాధి కూడా ఆమెకు ఉంది. గత వారం ఆమెను గుండె పోటు కారణంగా హాస్పిటల్‌లో చేర్చడంతో ఆమె ఆరోగ్యం గురించి అభిమానుల్లో ఆందోళన మొదలైంది. ఆమె సన్నిహితులు మాత్రం అది గుండెపోటు కాదని న్యుమోనియా పెరగడం వల్ల హాస్పిటల్‌లో చేర్చాల్సి వచ్చిందని చెప్తున్నారు.



అసౌకర్యాలను మరింత ఎక్కువ చేసుకుంటూ చిక్కుముడులు పీటముడులుగా తయారుచేసుకుం టున్నారు. అంగబలం, అర్థబలం చేతనయినంత తగా దుర్వినియోగం చేసుకుంటున్నారు. – శంకరానికి మనసు మొద్దుబారిపోయింది.

''నన్ను మీరు రక్షించనక్కర్లేదు, మీకు అడ్డం వచ్చానని శిక్షించనక్కర్లేదు. నా మానాన నన్ను వుండనీయండి. అదే మీరు నాకు చేయగలిగిన ఉపకారం. ఆపైన మీ యిష్టం. ఇంతకంటే నేను చెప్పవలసింది ఏమీలేదు. మీరు నాకంటే ఎక్కువ చదువుకున్నవారు, తెలివితేటలు వున్నవారు. మీ ముందు నేను వాదప్రతివాదాలు చేయలేను'' అని వచ్చినంత వేగంగానే ఆ అమ్మాయి అంతర్ధానం అయిపోయింది.


శంకరం యిక అమ్మాయి జోలికి వెళ్లడం తనకు అసాధ్యం అని నిర్ధారణకు వచ్చేశాడు.

అలాగే ఓ కోరమీసాల ఆసామి వచ్చాడు యింకో రోజు.

''దుర్మార్గాలు చేయడం నావృత్తి. అదే నాధర్మం అనుకుంటున్నాను. నా కారణాలు నాకు వున్నాయి. మీరెవరు నన్ను కాదనటానికి? నేనా పనులన్నీ చేయకపోతే నాకు నిద్రపట్టదు. నేను నిద్రపోకపోతే మీ దృష్టిలో మరింత ఆగడం చేస్తాను. అప్పుడు నన్ను మీరు అసలే త ట్టుకోలేరు'' అని బెదిరించాడు.

మనుషులతో పోట్లాడడమే చేతకాని శంక రానికి, యీ పాత్రలతో నిభాయించుకు రావడం యేమాత్రం కుదిరే పని కాదని తేలి పోయింది. మనస్సంతా ఆవరించుకు పోయిన వాళ్లను 'ఎవిక్ట్' చేయడం అసాధ్యం. అసలు వాళ్లు మనసులోకి రాకుండనే ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. ఒకసారి లోపలకు వచ్చారంటే వాళ్లదే రాజ్యం !

జరుగుతున్నదంతా ఊరికే చూస్తూ కూర్చో వడం సాధ్యమా? కలుగజేసుకుని కలిసి బతక డంలో వివేకం వుందా? అసలు గెలుపు, ఓటమి అనేవి వున్నాయా జీవితంలో ! -యివన్నీ తాత్త్విక ప్రశ్నలుగానే మిగిలిపోకుండా మనుషు లంతా వివాదాలు చేసుకుంటూ ఎందుకు కూర్చుంటు న్నారు? హాయిగా గడిచిపోవలసిన జీవితాన్ని యెందుకు బీభత్సం చేస్తున్నాయి?'' శంకరానికి యేమీ దిక్కుతోచకుండా పోయింది.



జయరావు వస్తే యేం సమాధానం చెప్పాలి? 'నన్ను చాలా యిబ్బంది పెడుతున్నావు. నీకో నమ స్కారం !! అని చేతులు దులిపేసుకోవాలా? ఒదుల యిన చొక్కాలు, పాంట్లు కుదించేయడం- బిగుత యిన వాటిని తగు మాత్రంగా 'లూజ్' చేయడం చాకచక్యంగా చేసుకుపోయే జయ రావు, యీ పని తనకెందుకు అంటగట్టుతున్నాడు? మార్పులు చేర్పులు లేకుండా వాటినే ధరించమనీ, లేకపోతే అవి సరిగ్గా అమరే వాళ్లకే యిచ్చివేయమనీ సలహా యివ్వకుండా యెందుకు కత్తెర, సూదీ-దారం మిషనూ చకచక నడుపుతున్నాడు?''

జయరావు రానే వచ్చాడు.

''మళ్లీ అంతా చదివాను. మరేమీ అనుకోకు. ఈ సారినాకు అసంతృప్తి అనిపించడం లేదు. ఉన్నదాన్ని ఉన్నట్లుగానే వుంచు. మరింకే వేలుపెట్టకుండా, అచ్చుకు యిచ్చేసెయ్యి. దానంతట అదే సరిపడుతుంది'' అని చెప్పేశాడు శంకరం.

''అంతేనంటారా? మొదటి నవలే పాడయిపోతే నాకు పేరు చెడిపోదూ''అన్నాడు జయరావు బేలగా ముఖంపెట్టి.

''పాడవటానికి యిందులో ఏమీ లేదు శంకరం. జీవితంలో వున్న లోపాలు స్పష్టంగా చూపించావు. చదివేవాళ్లకు తెలుసు వాటిని యెలా జీర్ణం చేసుకోవాలో. మధ్యలో మనం యెందుకు దూరటం? అయిందేదో అయింది. దీన్ని 'రేప్' చేయద్దు. రేపు రాసేదాంట్లో అవన్నీ సమసిపోతాయి''అని సముదాయించాడు.

జయరావు తన కాగితాలన్నీ శ్రద్ధగా తీసుకుంటూ సంచిలో పెట్టుకుని, ''మరి మీకేం యివ్వమంటారు యిప్పుడు?'' అనడిగాడు జేబులోంచి పర్సు తీస్తూ.

''ఏమీవద్దు. ఎడ్వాన్స్ యిచ్చిందే ఎక్కువ. వాపసు చేయటా నికి నా దగ్గర డబ్బులేదు. నా చేయి ముందుకు రావడం లేదు''

''అలా అనుకోకండి సర్. నాలుగు నెలలు దీంతో కుస్తీపట్టి మీ సమయం ఖర్చుపెట్టారు''

'సమయం ఒక్కటే కాదు, మనస్సు కూడా చెరుపుకున్నాను. కొన్ని పాఠాలూ నేర్చుకున్నాను. నిజానికి నేనే నీకు బాకీపడతా నేమో' అనుకున్నాడు శంకరం మనసులోనే, పైకి అంటే బాగుండదని.

''మరేం వద్దు. నాకీ అవకాశం యిచ్చావు, అంతే చాలు. సంతోషంగానే ముందు కార్యక్రమాలు జరుపుకో. అసంతృప్తిని పక్కకు నెట్టేసి, నీవు రాయదలుచుకున్నదంతా నిర్మొహమాటంగా వ్రాసేసెయ్యి. ఇంతకంటే నేనేం చెప్పలేను''

జయరావుకు ఉత్సాహం అనిపించింది. ''మీరు ఆశీర్వదిం చారు. అంతే చాలు. పుస్తకం ఆవిష్కరణ సభ ఏర్పాటు చేస్తాను. మీరే ముఖ్య అతిథిగా రావాలి సర్. ముందే చెబుతున్నాను'' అని సెలవు తీసుకున్నాడు. అతన్ని సాగనంపిన తరువాత శంకరం హాయిగా నిట్టూర్చాడు. అది విమోచనమో, యింకా బిగిసిపోయే శృంఖలమో అతనికి తెలియదు.

*